

సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



చీనీ టన్ను రూ.37,280
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.37,280 పలికాయి.



టమాట కిలో రూ.17
అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.17 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి ధర రూ.11 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
$32.8^{o}/16.9^{o}$
జిల్లా పరిధిలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి వాతావరణం నెలకొంది. ఆగ్నేయం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురండి
- హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్



హోంగార్డులకు శిక్షణ ఇస్తున్న కమాండెంట్

కదిరి టౌన్: హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ సూచించారు. మంగళవారం కదిరి రూరల్ పోలీసు స్టేషన్ వెనుక నారాయణ గ్రౌండ్‌లో నిర్వహించిన హోంగార్డుల పరేడ్‌ను ఆయన తనిఖీ చేసి.. దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ హోంగార్డుల విధులు సవాళ్లతో కూడుకున్నవని అన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విధుల్లో నైపుణ్యం మెరుగుపరచుకునేందుకు మెలకువలు తెలియజేశారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏఆర్, ఆర్‌ఎస్‌ఐ వీరన్న, హోంగార్డు ఇన్‌చార్జ్ రామాంజనేయులు, హోంగార్డులు పాల్గొన్నారు.

సౌదీ అరేబియాలో ఉద్యోగావకాశాలు

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓంక్యాప్ ,ఆల్ యూసెఫ్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా యువతీ యువకులకు సౌదీ అరేబియాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి, 35 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు సౌదీ అరేబియాలో దేశంలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు భారత కరెన్సీ ప్రకారం మగవారికి రూ.78 వేలు, ఆడవారికి రూ.89 వేల జీతం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 18లోపు skillinternational@apssdc.in మెయిల్‌కు బయోడేటా పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సాగునీటి ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రశాంతి నిలయం: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ చేతన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణ గెజిట్ నోటిఫికేషన్‌ను కలెక్టర్ విడుదల చేశారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ కింద 214 సాగునీటి సంఘాలు ఉన్నాయని, మీడియం ఇరిగేషన్ కింద 16 ఉన్నాయని వివరించారు. 14వ తేదీన సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నిలకడగా ఎండు మిర్చి ధరలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎండు మిర్చి ధరలు మంగళవారం నిలకడగా సాగాయి. మార్కెట్‌కు 164 మంది రైతులు 195.40 క్వింటాళ్ల ఎండు మిర్చి తీసుకొచ్చారు. మొదటి రకం క్వింటాలు రూ.17వేలు, రెండో రకం రూ.8వేలు, మూడో రకం రూ.7వేలు ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. గత వారంతో పోలిస్తే ధరలు కాస్త పెరిగి నిలకడగా ఉన్నాయని పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో కిడ్నాపర్?

మడకశిర: బేగార్లపల్లికి చెందిన బాలిక కిడ్నాప్ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. కిడ్నాపర్‌ను అదుపులోకి తీసుకుని బాలికను రక్షించినట్లు సమాచారం. అయితే పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు. బాలిక మూడు రోజుల క్రితం కిడ్నాప్‌కు గురైన సంగతి తెలిసిందే. కుమార్తెను రక్షించాలని తల్లిదండ్రులు సోమవారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. విచారణలో జరుగుతున్న జాప్యానికి మనస్తాపం చెందిన బాలిక తల్లిదండ్రులు వేరువేరుగా ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసుల పనితీరుపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో పోలీసులు విచారణను వేగవంతం చేసి కిడ్నాపర్‌ను పట్టుకుని, బాలికను రక్షించినట్లు తెలిసింది. కిడ్నాపర్ అదే గ్రామానికి చెందిన వ్యక్తి అని సమాచారం.

సచివాలయ సేవల్లో జాప్యం

> సచివాలయ సేవల్లో జాప్యం జరుగుతోంది. తగినంత మంది సిబ్బంది లేకపోవడమే ఇందుకు కారణం. ఖాళీల భర్తీలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- సిబ్బంది కొరతే కారణం
- జిల్లా వ్యాప్తంగా 974 పోస్టులు ఖాళీ
- పనిభారంతో సతమతమవుతున్న ఉద్యోగులు
- పోస్టుల భర్తీలో కూటమి ప్రభుత్వం తాత్సారం



మడకశిర మండలంలోని కదిరేపల్లి సచివాలయం

మడకశిర: కులం, మతం, వర్గం, రాజకీయాలకు అతీతంగా ప్రజలందరికీ సులువుగా ప్రభుత్వ సేవలు అందించేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ఇదివరకు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లకుండా గ్రామస్థాయిలోనే అన్ని సేవలూ అందుబాటులో ఉండేవి. దీంతో దూరాభారం, వ్యయప్రయాసలు తగ్గి.. సమయం ఆదా అయ్యేది. ప్రస్తుతం సిబ్బంది కొరతతో సేవలకు అంతరాయం కలుగుతోంది. జిల్లాలో 32 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో గ్రామ, వార్డు సచివాలయాలు 544 ఉన్నాయి. 5,325 పోస్టులకు గాను 4,351 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంకా 974 పోస్టులు ఖాళీ ఉన్నాయి. దీంతో ప్రజలకు అందాల్సిన సేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

ఖాళీల భర్తీ ఏదీ..?

రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి రాగానే ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా ఇంతవరకూ పోస్టుల భర్తీపై దృష్టి సారించలేదని నిరుద్యోగులు వాపోతున్నారు.

పనిభారంపై అసంతృప్తి

కూటమి సర్కారు తీరుపై సచివాలయాల సిబ్బంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్ హయాంలో వలంటీర్ల వ్యవస్థ ఉండేది. వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ తదితర ప్రభుత్వ సేవలు ప్రజలకు అందేవి. అయితే చంద్రబాబు సీఎం అయ్యాక వలంటీర్ల వ్యవస్థకు మంగళం పాడారు. దీంతో సచివాలయాల సిబ్బందిపై పనిభారం పెరిగింది. వలంటీర్లు లేకపోవడంతో పింఛన్లను కూడా సిబ్బందే పంపిణీ చేస్తున్నారు. ఖాళీలు భర్తీ చేయకపోవడంతో మరింత పనిభారం పెరిగిపోయిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వార్డు సచివాలయాల సంఖ్య	131
మంజూరైన పోస్టుల సంఖ్య	1,131
ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య	968
మొత్తం వార్డు సచివాలయాల్లో ఖాళీల సంఖ్య	163

413	జిల్లాలో గ్రామ సచివాలయాల సంఖ్య
4,194	మంజూరైన పోస్టుల సంఖ్య
3,383	ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగుల సంఖ్య
811	మొత్తం గ్రామ సచివాలయాల్లో ఖాళీల సంఖ్య

సిబ్బంది కొరత తీర్చాలి



కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు ప్రజలకు సక్రమంగా అందడం లేదు. సిబ్బంది కొరతతో ఈ పరిస్థితి ఏర్పడింది. సచివాలయాల్లో ఖాళీ పోస్టులన్నీ వెంటనే భర్తీ చేయాలి. సచివాలయాల్లో ప్రజలకు జాప్యం కాకుండా సేవలందించడానికి చర్యలు తీసుకోవాలి. లేకపోతే ప్రజలు ప్రభుత్వానికి ఎదురు తిరగడం ఖాయం.

–ఉషశ్రీచరణ్, మాజీ మంత్రి

సేవలు నిర్వీర్యం



సచివాలయ సేవలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వైఎస్ జగన్ మంచి ఉద్దేశంతో సచివాలయాల వ్యవస్థ ఏర్పాటు చేశారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం ఖాళీ పోస్టులను భర్తీ చేయడానికి ముందుకు రావడం లేదు. సకాలంలో ప్రభుత్వ సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సచివాలయ సేవలు మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలి.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

సర్టిఫికెట్ల జారీలో జాప్యం



సచివాలయాల్లో సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతున్నాం. ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందడానికి ఇబ్బంది పడుతున్నాం. వైఎస్సార్‌సీపీ హయాంలో అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాలను సచివాలయాల ద్వారా వెంటనే పొందేవాళ్లం. ప్రస్తుతం సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. సిబ్బంది కొరతతో ఈ పరిస్థితి ఏర్పడింది. వెంటనే సిబ్బంది కొరత తీర్చాలి.

–చంద్రప్ప,మధూడి, అగళి మండలం

సేవలు నామమాత్రం



ప్రస్తుతం సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు అంతంత మాత్రమే. ప్రజలు పనుల కోసం సచివాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. సంబంధిత శాఖల సిబ్బంది అందుబాటులో లేరు. ఖాళీలను భర్తీ చేసి సేవలకు ఆటంకం లేకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది.

– చిత్తయ్య, జీజీ హట్టి గ్రామం, రొళ్ల మండలం

తాడిమర్రిలో ఎట్టకేలకు మద్యం దుకాణం ప్రారంభం



మద్యం దుకాణం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలో కూటమి పార్టీల నాయకుల అడ్డంకులు దాటుకుని కోర్టు ఆదేశాలతో పోలీసులు, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో ఎట్టకేలకు మద్యం దుకాణం ప్రారంభమైంది. మద్యం దుకాణాల నిర్వహణ కోసం ప్రభుత్వం అక్టోబర్ 9న లాటరీ తీసింది. తాడిమర్రి షాపు నంబర్ 16ను హైదరాబాద్‌కు చెందిన కొండపల్లి గణేష్ దక్కించుకున్నాడు. అతని నుంచి దుకాణం లీజుకు తీసుకోవాలని టీడీపీ, బీజేపీ నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. చివరకు తాడిమర్రికి చెందిన బీజేపీ నాయకుడు అతనితో లీజుకు మాట్లాడుకుని 24వ తేదీన దుకాణం ప్రారంభోత్సవానికి పూనుకున్నాడు. దుకాణం తమకు కాకుండా బీజేపీ నాయకులు ఎలా ఓపెన్ చేస్తారని టీడీపీ నాయకులు దాడికి దిగారు. దుకాణంలో సరుకు దింపకుండా అడ్డుకున్నారు. దీంతో దుకాణం ప్రారంభానికి ప్రత్యేక రక్షణ కల్పించాలని కొండపల్లి గణేష్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు 50 రోజుల తర్వాత ఎక్సైజ్ సీఐ చంద్రమణి, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు, పోలీసుల సమక్షంలో మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు దుకాణం ప్రారభించారు. గతంలో దుకాణానికి బీజేపీ నాయకుడు ఒక తాళం, టీడీపీ నాయకులు మరో తాళం వేశారు. ఆ తాళం చెవులు లేకపోవడంతో బద్దలుకొట్టి మరీ షాపు తెరిచి, మద్యం విక్రయాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణవేణి, ఏఎస్‌ఐలు వన్నప్ప, సూర్యనారాయణ రాజు, హెచ్‌సీలు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, నాగరాజు, ఎక్సైజ్ హెచ్‌సీలు రాజగోపాల్, వెంకటేశ్వర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

లేపాక్షి: రెవెన్యూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. లేపాక్షి మండలం శిరివరం సచివాలయం ఆవరణలో జరిగిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తుల నుంచి పలు అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. గ్రామపెద్దలు, తహసీల్దార్ సమక్షంలో ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందో గుర్తించి శ్మశానవాటికకు కేటాయించేలా ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తామన్నారు. సివిల్ సమస్యలు ఉంటే గ్రామ పెద్దల ద్వారా లేదా సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించారు. చెరువు కాలువలు, చెరువు గర్భాలు, కాలువ గట్లకు పట్టాలు ఇచ్చే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. రీసర్వే, అడంగల్‌లో చేర్పులు, మార్పులు, సర్వే నంబర్లు తప్పుగా వేయడం, ఆర్‌ఎస్‌ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు, విక్రయాలు తదుపరి పేర్ల మార్పిడి, ఆక్రమణలు, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన వాటి వివరాలు తెలుసుకోవడానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేత్రావతి, మండల స్పెషల్ ఆఫీసర్, ఏపీఎంఐపీ పీడి సుదర్శన్, ఆర్డీఓ ఆనందకుమార్, తహసీల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కూటమి సర్కారు కళ్లు తెరిపిద్దాం

- 13న భారీ ర్యాలీని విజయవంతం చేయండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కూటమి సర్కారు కళ్లు తెరిపిద్దామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ రైతులకు పిలుపునిచ్చారు. రైతుల సమస్యలపై ఈ నెల 13న పుట్టపర్తిలో నిర్వహించే భారీ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. మంగళవారం చల్లాపల్లిలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలముందు రైతులకు అండగా ఉంటామని కూటమి పార్టీల నేతలు హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక విస్మరించారని ధ్వజమెత్తారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో సమయానికి రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం జమయ్యేదని తెలిపారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయం ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చి అమలు చేయకుండా మోసం చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు బనాయిస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కింద అందిన డబ్బుతో మహిళలు మద్యం, గంజాయికి బానిసలయ్యారని మంత్రి సవిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ముస్లింల శ్మశానవాటిక స్థలానికి సంబధించి మంత్రి భర్త వెంకటేశ్వరరావు ఓ కౌన్సిలర్, మైనార్టీలను ఉద్దేశించి కాళ్లీలు లేచి పోతాయని వార్నింగ్ ఇవ్వడం చూస్తే పెనుకొండలో రౌడీ రాజ్యం నడుస్తోందని అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ మాజీ సమన్వయకర్త బాబురెడ్డి, మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసలు, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, సర్పంచ్ కిష్టప్ప, సింగిల్‌విండో చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు కంబాలప్ప తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ‘మాతృదేవోభవ’

ప్రశాంతి నిలయం: తల్లిని పూజించే ప్రతి మనిషీ సర్వోన్నతులవుతారన్న సందేశాన్నిస్తూ చిన్నారులు నిర్వహించిన ‘మాతృదేవోభవ’ నృత్యరూపకం భక్తులను అలరించింది. పర్తి యాత్రలో భాగం గుంటూరు జిల్లా సత్యసాయి భక్తులు పుట్టపర్తికి విచ్చేశారు. మంగళవారం సాయంత్రం ప్రశాంతి నిలయంలోని సత్యసాయి సన్నిధిలో గుంటూరు జిల్లా బాలవికాస్ చిన్నారులు ‘మాతృదేవోభ’ పేరుతో సంగీత నృత్యరూపకం ప్రదర్శించారు. వినాయకుడు, శ్రీకృష్ణుడు, సత్యసాయి తల్లిని సేవించి, ప్రేమించి, గౌరవించి ఆదర్శ పురుషులుగా నిలిచిన తీరును చక్కగా వివరించారు.







‘మాతృ దేవోభవ’ నృత్యరూపకంలోని ఘట్టాలు

ఫుల్లుగా కమీషన్ల కిక్కు

మద్యం డిపోలో వసూళ్ల మాఫియా
- కమీషన్ ఇస్తే అడిగినంత సరుకు సరఫరా
- కాదు..లేదు అంటే కోతలు
- ఒక్కో వైన్ షాపునుంచి నెలకు రూ.5 వేల మేర కప్పం
- మద్యం కేస్‌లు ఓపెన్ చేసి చూపించరు.. లీకేజీ ఉంటే భరించాల్సిందే
- లబోదిబోమంటున్న షాపుల నిర్వాహకులు





అనంతపురంలోని మద్యం డిపో

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పుష్ప సినిమా తరహాలో సిండికేట్‌గా మారి మద్యం షాపుల పర్మిట్ల కోసం ఇటీవల టీడీపీ నేతలు పోటీపడ్డారు. ఆ తర్వాత బెల్టుషాపులు, పర్మిట్ రూముల పేరుతో విచ్చలవిడిగా మద్యం అమ్మిస్తున్నారు. ఇప్పటి వరకూ పాలకుల ఆగడాలు ఒకెత్తయితే అవినీతిలో తామేం తక్కువ అన్నట్లు మద్యం డిపోను వసూళ్లకు అడ్డాగా మార్చారు కొందరు ప్రబుద్ధులు. డిస్టిలరీల నుంచి వచ్చే మద్యాన్ని సజావుగా, సక్రమంగా సరఫరా చేయాల్సిన డిపో అక్రమాలకు నిలయంగా మారింది. డిపో మేనేజర్, ఇతర సిబ్బంది సిండికేట్‌గా మారి వసూళ్లకు తెరలేపారు. డిపోలో అధికారుల తీరుకు నిరసనగా జిల్లాలోని వైన్ షాపుల నిర్వాహకులు, బార్‌ల యాజమాన్యాలు ధర్నాకు దిగాలని యోచిస్తున్నట్లు తెలిసింది.

మామూళ్లిస్తే కావాల్సినంత మద్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రమారమి 230 వైన్ షాపులు ఉన్నాయి. వీరిలో ఎవరైనా సరే డిపోకెళ్లి అడిగినంత సరుకు కావాలంటే మామూళ్లిచ్చుకోవాల్సిందే. లేదంటే రేషన్ తరహాలో కోత వేస్తున్నారు. ముఖ్యంగా చీప్‌లిక్కర్, బీర్‌ల విషయంలో ఇలా వ్యవహరిస్తున్నారు. కొన్ని ఫాస్ట్ మూవింగ్ బ్రాండ్ల (బాగా అమ్ముడయ్యే మద్యం) విషయంలోనూ ఎక్కువగా కోత ఉంది. అధికార పార్టీకి చెందిన కొంతమందికి మాత్రం రాత్రి పూట మద్యం లోడ్ చేసి పంపిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మంగళవారం కొందరు బార్‌ల యజమానులు డిపోకు వెళ్లి అక్కడి అధికారుల అవినీతిపై మండిపడ్డారు. తాము డబ్బు కడతామంటే సరుకు ఎందుకివ్వరని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అవినీతి కంపు..

గత ప్రభుత్వ హయాంలో మద్యం డిపోపై ఎప్పుడూ చిన్న ఫిర్యాదు కూడా లేదు. కానీ కూటమి సర్కారు వచ్చిన తర్వాత కొత్త మద్యం పాలసీ తెచ్చింది. దీంతో మద్యం డిపో అవినీతి కూపంలో కూరుకుపోయింది. ఒక్కో వైన్‌షాపు నెలకు రూ.5 వేల మేర డిపో అధికారులకు చెల్లించాల్సిందేనని రేటు ఫిక్స్ చేశారు. లేదంటే అడిగినంత సరుకు ఇచ్చేది ఉండదు. మద్యం కేస్‌లను ఓపెన్ చేసి చూపించడం లేదని, బాటిళ్ల లీకేజీ ఉంటే ఆ ఖర్చు వైన్‌షాపు నిర్వాహకులే భరించుకోవాల్సి వస్తోందని తెలిసింది. మద్యం ఇండెంట్‌లలో ఒక్కో బిల్లుకు రూ.250 చెల్లించాల్సిందే. రోజూ బిల్లు చేయించుకునేందుకు గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. రోజుకు 300కు పైగా బిల్లులు జనరేట్ అయితే, ఇందులో ఒక్కో బిల్లుకు రూ.250 చొప్పున రోజుకు రూ.75 వేలు అనధికారికంగా ఇవ్వాలి. డిపో మేనేజర్ ఆదేశాల మేరకే ఇదంతా జరుగుతోందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇలాంటి అక్రమాలతో కూటమి సర్కారు తెచ్చిన మద్యం పాలసీ అభాసుపాలవుతోంది.

మద్యం డిపోలో ఒక నెలలో మామూళ్ల పరిస్థితి ఇలా..	
మొత్తం షాపులు	230
ఒక్కో షాపు నుంచి	రూ.5,000
ఒక్కో బార్	రూ.5,000
ఒక్కో బిల్లుకు	రూ.250
బిల్లు స్కానింగ్‌కు	రూ.100
బిల్లు ప్రింట్‌కు	రూ.100
హమాలీల పేరిట	రూ.200
వైన్ షాపుల నుంచి మొత్తం	రూ.11,50,000
బార్‌ల నుంచి	రూ.1,05,000

ఒక్కో ఫిర్యాదునూ పరిష్కరిస్తున్నాం

డిపోలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఒక్కో ఫిర్యాదునూ పరిష్కరిస్తూ వస్తున్నాం. నెలకు రూ.5 వేలు తీసుకోవడం లేదు. హమాలీల అజమాయిషీ మా చేతుల్లో లేదు. కొన్ని సరిహద్దు షాపులకు కాస్త ఎక్కువ మద్యం ఇవ్వాలనేది ఉంది. అందుకే ఇస్తున్నాం. నేను కూడా కొత్తగా వచ్చాను. అన్నీ పరిశీలిస్తున్నా.

–డా.బి.వెంకటనాయుడు, మద్యం డిపో మేనేజర్

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య


లక్ష్మీదేవి (ఫైల్)

ధర్మవరం అర్బన్: జీవితంపై విరక్తితో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన మేరకు... మంగళవారం ఉదయం వాకింగ్‌కు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చిన ధర్మవరంలోని సిద్ధయ్యగుట్టకు చెందిన లక్ష్మీదేవి(59) స్థానిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మొదటి మరువ సమీపంలో తేలుతున్న మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించారు. మృతురాలిని లక్ష్మీదేవిగా గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. మతిస్థిమితం లేని ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రమాదంలో ఆర్‌ఎంపీ మృతి


మృతుడు వన్నూరప్ప

రామగిరి: మండలంలోని పేరూరు సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఆర్‌ఎంపీ వన్నూరప్ప (36) మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... పెద్దకొండాపురం గ్రామానికి చెందిన చాకలి వన్నూరప్ప పేరూరులో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు ప్రథమ చికిత్స అందజేస్తుండేవాడు. కొన్నేళ్లుగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఆయన మంగళవారం ఉదయం స్వగ్రామం నుంచి తన వైద్య కేంద్రానికి ద్విచక్రవాహనంపై వస్తుండగా పేరూరు సమీపంలోకి చేరుకోగానే ఫిట్స్ రావడంతో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు గుర్తించి వెంటనే పీహెచ్‌సీకి తరలించారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రామగిరి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, వన్నూరప్పకు భార్య లక్ష్మీదేవి, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య


లక్ష్మీదేవి మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీదేవి(60) ఆత్మహత్య చేసుకుంది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె కొన్ని నెలలుగా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని విష ద్రావకం తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అద్దెల భారం...

డ్రోన్ వ్యవసాయం

- పంటల్లో చీడపీడల నివారణకు డ్రోన్‌ల ద్వారా మందుల పిచికారీ
- అద్దె ఎక్కువగా ఉండడంతో ఇబ్బంది
- ఆర్‌ఎస్‌కేల్లో అందుబాటులో ఉంచాలంటూ రైతుల విజ్ఞప్తి


మడకశిర వద్ద కంది పంటకు డ్రోన్ ద్వారా పురుగుల మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

మడకశిర: ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయంలో నూతన ఒరవడి సృష్టించాలని కూటమి సర్కార్ పిలుపునిస్తున్నా... ఆ దిశగా క్షేత్ర స్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో రైతన్న కష్టాలు తీరడం లేదు. ఆధునిక సాంకేతికత వైపు ఆసక్తి ఉన్న అందుకయ్యే ఖర్చు తలుచుకుని బెంబేలెత్తిపోతున్నారు.

నేడు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేయడానికి సిద్ధంగా ఉన్నా కూటమి ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లభించడం లేదు. ప్రధానంగా పంటలకు మందులను పిచికారీ చేయడానికి రైతులు డ్రోన్‌లను అద్దెకు తెచ్చుకుంటున్నారు. కూలీల అవసరం లేకుండా డ్రోన్‌ల ద్వారా మందులను పిచికారీ చేపడితే సమయం ఆదా అవుతుందని అధికారులు సైతం అవగాహన కల్పిస్తున్నారు. గంటకు 3 ఎకరాల విస్తీర్ణంలో పంటకు పురుగుల మందును పిచికారీ చేయడం రైతులకు కలిసివచ్చే అంశమే అయినా... డ్రోన్‌ల అద్దె భారం భరించలేకపోతున్నామంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా స్థానికంగా రైతులకు డ్రోన్‌లు అద్దెకు దొరకడం లేదు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి ఉంటుంది. డ్రోన్ యజమానులు గంటకు రూ.800 నుంచి రూ. వెయ్యి వరకూ అద్దె వసూలు చేస్తున్నారు. ప్రభుత్వమే డ్రోన్‌లను రైతులకు వందశాతం సబ్సిడీతో సరఫరా చేస్తే ఎంతో వెసులుబాటు ఉంటుందని రైతులు కోరుతున్నారు. లేకుంటే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందుబాటులో ఉంచినట్లుగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆర్‌ఎస్‌కేల ద్వారా డ్రోన్‌లనూ అందివ్వాలని కోరుతున్నారు.

నాడు అన్నింటా ప్రోత్సాహం

ప్రధానంగా వ్యవసాయ పనులకు కూలీల అవసరం ఎక్కువగా ఉంటోంది. విత్తు మొదలు పంట కోత వరకూ కూలీలు లేనిదే పనులు ముందుకు సాగవు. అయితే ప్రస్తుత రోజుల్లో కూలీల కొరత ఎక్కువగా ఉండడంతో వ్యవసాయ పనులు సకాలంలో పూర్తి కాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో కూలీలకు చాలా డిమాండ్ పెరిగింది. ఈ సమస్యను అధిగమించేందుకు ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు రైతులు దృష్టి సారించారు. దీంతో సమయం ఆదా కావడమే కాకుండా ఆర్థిక భారం కూడా తగ్గుతోంది. ఈ విషయాన్ని గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తూ వచ్చింది. గ్రామాల్లోనే రైతులకు అందుబాటులోకి తీసుకుచ్చిన ఒక్కో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రానికి ఒక్కో ట్రాక్టర్‌తో పాటు వివిధ వ్యవసాయ పరికరాలను అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందుబాటులో ఉంచారు. అవసరమున్న రైతులు అతి తక్కువ అద్దె చెల్లించి ఆయా యంత్ర పరికరాలను తీసుకెళ్లి వ్యవసాయంలో వినియోగించుకుని తిరిగి ఆర్‌బీకేలకు అప్పగిస్తూ వచ్చారు. రైతు భరోసా పథకం ద్వారా సీజన్‌కు ముందే రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.13,500ను పెట్టుబడి సాయం కింద వైఎస్ జగన్ అందజేస్తూ వచ్చారు. సమయానికి పంటల బీమా, పంటల నష్టపరిహారాన్ని అందించడంతో అప్పట్లో వ్యవసాయం సుసంపన్నమైంది.

ఆర్‌ఎస్‌కేల్లో అందుబాటులో ఉంచాలి



ఒక్క డ్రోన్ కొనుగోలు చేయాలంటే సామర్థ్యాన్ని బట్టి రూ. 5 లక్షల నుంచి రూ.9 లక్షల వరకూ వెచ్చించాల్సి వస్తోంది. దీంతో డ్రోన్‌లను కొనుగోలు చేయలేకపోతున్నాం. అద్దెకు తెస్తామనుకుంటే బాడుగల భారం భరించలేకపోతున్నాం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సబ్సిడీతో ఆర్బీకేలకు ట్రాక్టర్లను, వ్యవసాయ పరికరాలను అందించి రైతులను ఆదుకుంది. అదే తరహాలో ఈ ప్రభుత్వం కూడా ఒక్కో ఆర్‌ఎస్‌కేకు ఒక్కో డ్రోన్‌ను అందుబాటులోకి తీసుకురావాలి.
– నాగరాజు, రైతు, అగళి

కొనుగోలుపై 50 శాతం సబ్సిడీ



డ్రోన్ కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు ముందుకొస్తే డ్రోన్‌ల వినియోగంపై శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటాం.
– కృష్ణమీనన్, ఏడీఏ, మడకశిర

యువకుడి దుర్మరణం


నుజ్జునుజ్జయిన బొలెరో


మృతుడు గిరీష్

పావగడ: స్థానిక తుమకూరు రోడ్డులోని ఎస్‌ఆర్‌ఎస్ పెట్రోల్ బంక్ వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో బొలెరో వాహన డ్రైవర్ గిరీష్ (21) దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మంగళవారం ఉదయం పావగడ వైపుగా పెయింట్ల డబ్బాలతో వస్తున్న బొలెరో వాహనం పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఘటనలో బొలెరో నుజ్జునుజ్జయింది. వాహనంలోనే చిక్కుకుని డ్రైవర్ గిరీష్ దుర్మరణం పాలయ్యాడు. ప్రమాదానికి కారణమైన లారీ ఎదురుగా వస్తున్న ఒమినీ వాహనాన్ని తప్పించబోయి ఉన్నఫళంగా తన మార్గాన్ని మార్చుకోవడంతో ఆ వెనుకనే ఉన్న బొలెరో ఢీకొన్నట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మృతుడు మండ్య జిల్లా మద్దూరు తాలూకా సోమనహళ్లికి కి చెందిన పుట్టస్వామి కుమారుడు గిరీష్‌గా పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ సురేష్, ఎస్‌ఐ గురునాథ్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

12న రగ్బీ సబ్ జూనియర్ జిల్లా స్థాయి పోటీలు

అనంతపురం: జిల్లా స్థాయి సబ్ జూనియర్ (అండర్–15 బాలికలు, బాలురు) రగ్బీ పోటీలు ఈ నెల 12న బత్తలపల్లిలోని ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, డైరెక్టర్ కె.రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2009, 2010, 2011 సంవత్సరాల్లో జన్మించిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు పూర్తి వివరాలకు 81066 74037, 97041 08321లో సంప్రదించవచ్చు.

ఒకే ఈతలో రెండు దూడలు


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

రాయదుర్గం: ఒకే ఈతలో రెండు దూడలకు ఆవు జన్మనిచ్చింది. మంగళవారం ఉదయం రాయదుర్గం మండలం 74 ఉడేగోళంలో ఈ ఘటన చోటు చేసుకుంది. తన వ్యవసాయ క్షేత్రంలో పెంచుతున్న దేశవాళీ ఆవు రెండు దూడలకు జన్మనివ్వడంపై రైతు వరకూటి హంపారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇందులో ఒకటి పెయ్య దూడ అని తెలిపారు. రెండు దూడలూ ఆరోగ్యంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

యాడికి: యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన తలారి జ్యోతి తన ఇద్దరు పిల్లలతో సహా కనిపించకుండా పోయింది. ఈ నెల 3న ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం రాత్రి జ్యోతి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టారు.

భక్తుల కొంగుబంగారం బాబయ్యస్వామి


పెనుకొండలోని బాబయ్య స్వామి దర్గా


బాబయ్య సమాధి

- 13న గంధం వేడుకలు, సర్వమత సమ్మేళనం

పెనుకొండ: భక్తుల కొంగుబంగారంగా పెనుకొండ బాబయ్యస్వామి దర్గా విరాజిల్లుతోంది. బాబయ్య స్వామిని దర్శించుకుంటే కష్టాలు తీరుతాయని, కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ప్రతి ఏటా నిర్వహించే దర్గా ఉరుసు ఉత్సవాలకు హిందువులు, ముస్లింలు పెద్ద ఎత్తున హాజరవుతారు. మత సామరస్యాన్ని చాటే దర్గా ఉరుసు ఉత్సవాలు ఈ నెల 13న ప్రారంభం కానున్నాయి. శుక్రవారం రాత్రి 9 గంటలకు సర్వమత సమ్మేళనం నిర్వహించనున్నారు. అన్ని మతాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారు. అన్ని మతాల సారాంశం ఒక్కటే అన్న సందేశాన్నిస్తారు. అర్ధ రాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజాము వరకు దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా నేతృత్వంలో గంధం వేడుకలు కొనసాగుతాయి. ఈ పరంపరలో మొదటి గంధం వేడుకలను బాబయ్య స్వామి వంశీకులు సజ్జద్‌బాబా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తుల కోలాహలం, ఫకీర్ల విన్యాసాలు మత పెద్దలు వెంటరాగా పీఠాధిపతి గంధం వేడుకల సందల్ మహల్ నుంచి కార్యక్రమాన్ని చేడుతారు. బాబయ్య సమాధికి గంధాన్ని అవనతం చేయడంతో ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధం వేడుకలు ముగుస్తాయి. అనంతరం 15 రోజులకు పైగా ఉరుసు కొనసాగుతుంది. కార్యక్రమంలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. దర్గా నిర్వహకులతో పాటు మున్సిపల్ అధికారులు భక్తులకు తాగునీరు. మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడానికి చకచకా ఏర్పాట్లు చేపట్టారు.

రెండు కోర్టులను యథాతథంగా ఉంచాలి


దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: సీఐడీ కోర్టును కర్నూలులోని ఏసీబీ కోర్టుకు, గంజాయి, తదితర మాదక ద్రవ్యాల కేసుల విచారణను జిల్లా అదనపు కోర్టు నుంచి ప్రత్యేక కోర్టులకు బదలాయించడంతో పాటు, తిరుపతిలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయడంపై న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన జీఓలను రద్దు చేయాలంటూ అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఆరో రోజుకు చేరుకుంది. రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న న్యాయవాదులకు సీపీఐ నేత నారాయణస్వామి, బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కాసాని నాగరాజు, అంకె కుళ్లాయప్ప, ఆర్గనైజింగ్ సెక్రెటరీ హరిప్రసాద్, జిలాన్‌బాషా సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. .ఎన్‌డీపీఎస్ కోర్టును అనంతపురం నుంచి తిరుపతికి తరలించి పట్టుమని పది రోజులైనా గడవక ముందే సీఐడీ కోర్టును కర్నూలుకు తరలించడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. దీంతో న్యాయవాదులకు, కక్షిదారులకు, అందరికీ ఇబ్బందులేనని పేర్కొన్నారు. ఇది వరకు అనంతపురం అదనపు జిల్లా జడ్జి పర్యవేక్షణలో ఉన్న ఎన్‌డీపీఎస్ కోర్టును తిరుపతికి తరలించడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకూ పోరాటం చేస్తున్న న్యాయవాదులకు సంపూర్ణ మద్దతునిస్తామన్నారు. సీనియర్ న్యాయవాది హనుమన్న మాట్లాడుతూ.. రెండు కోర్టులను తరలించడం వల్ల కేసుల విచారణలో ఎక్కువ జాప్యం చోటుచేసుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీక్షలో సీనియర్ న్యాయవాదులు సి. హనుమన్న, నార్పల శ్రీధర్, వి.కేశవయ్య, ఇతర న్యాయవాదులు దీక్షలో పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం!

- గర్భం దాల్చడంతో అనంతపురం ఆస్పత్రిలో చికిత్స
- నిందితుడిపై పోక్సో, రేప్ కేసు నమోదు

గార్లదిన్నె: మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఓ బాలికపై లైంగికదాడి జరిగింది. బాలిక గర్భం దాల్చడంతో విషయం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ముంటిమడుగుకు చెందిన వంశీ అనే వ్యక్తి వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రోజూ కల్లూరు నుంచి వ్యవసాయ కూలీలను పనుల నిమిత్తం వ్యానులో ఎక్కించుకొని వెళ్లి.. మళ్లీ సాయంత్రం పని ముగిసిన తరువాత గ్రామానికి తీసుకొచ్చేవాడు. ఈ క్రమంలో ఓ బాలికతో వంశీ పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి లొంగదీసుకున్నాడు. పలుమార్లు అత్యాచారం చేశాడు. పదో తరగతి వరకు చదివిన బాధిత బాలికకు తన తల్లిదండ్రులు లేక పోవడంతో అమ్మమ్మ ఇంట్లో ఉంటూ రోజూ వ్యవసాయ పనులకు వెళ్లేది. సోమవారం అర్ధరాత్రి కడుపు నొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకుంది. నీరసంగా ఉండి కళ్లు తిరిగి పడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఏడు నెలల గర్భిణి అని నిర్ధారించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బాలికను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి వెళ్లి బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. వారి ఫిర్యాదు మేరకు నిందితుడు వంశీపై పోక్సో, రేప్ కేసులు నమోదు చేశారు.

ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నం

ఉరవకొండ: స్థానిక 5వ సచివాలయ పరిధిలో ఆశా కార్యకర్తగా పని చేస్తున్న శర్మాస్‌బీ ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గత రెండేళ్లుగా ఎంఎల్‌హెచ్‌పీ సులోచన వేధిస్తోందని, ఈ వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో తీవ్ర మనస్తాపం చెంది వివిధ రకాల మాత్రలను శర్మాస్‌బీ మింగిందని పోలీసులకు భర్త శర్మష్ ఫిర్యాదు చేశాడు. విధుల్లో ఉన్న తన భార్యపై పలు మార్లు ఆమె చెయ్యి కూడా చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆమె వేధింపులు తాళలేక సచివాలయంలోనే వివిధ రకాల మాత్రలను ఆమె మింగినట్లు వివరించాడు. కాగా, చికిత్స అనంతరం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

టీడీపీ కార్యకర్తల బాహాబాహీ

పెద్దవడుగూరు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో మంగళవారం టీడీపీ కార్యకర్తలు బాహాబాహీగా తలపడ్డారు. గ్రామంలో ఉదయం తహసీల్దార్ ఉషారాణి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. మధ్యాహ్నం అధికారులు భోజనానికి వెళ్లారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు యల్లావుల రామన్న అలియాస్ రమణపై దాదా, జాకీర్, రసూల్ మరో ఇరువురు దాడి చేశారు. రామన్నకు తీవ్ర గాయాలయ్యాయి. గత కొన్ని రోజులుగా గ్రామంలో రేషన్‌షాపు నిర్వహణ అంశంలో టీడీపీ నేతల మధ్య విభేదాలు ఉన్నాయని, ఈ క్రమంలోనే దాడులు చోటు చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఘటనపై బాధితుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.

యువకుడి బలవన్మరణం

రాయదుర్గం టౌన్: జీవితంపై విరక్తితో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం టి.వీరాపురం గ్రామానికి చెందిన కుండ రామన్న కుమారుడు గంగాధర్ (28) వ్యవసాయ కూలి పనులతో ఇంటికి చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక కొన్ని రోజుల క్రితం తల్లి అంజినమ్మ ఇల్లు విడిచి వెళ్లిపోయింది. దీంతో మానసికంగా కుదేలైన గంగాధర్ కూడా రెండు రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాయదుర్గం రైల్వే స్టేషన్‌కు కొద్ది దూరంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం వేకువజామున పట్టాల మధ్య పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించిన గ్యాంగ్‌మెన్ సమాచారంతో గుంతకల్లు జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

దేశంలో మానవహక్కుల ఉల్లంఘన

- పౌర చైతన్య వేదిక ప్రదర్శనలో వక్తలు

అనంతపురం అర్బన్: 'దేశంలో యథేచ్ఛగా మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోంది. ప్రజాస్వామిక హక్కులు, లౌకికవాదం, మానవహక్కులను ప్రస్తుత పాలకులు హరిస్తున్నారు. మరోవైపు మహిళలు, బాలికలు, పిల్లలపై అత్యాచారాలు పెరిగిపోయాయి' అని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ డి.గోవిందరాజులు, మానవ హక్కుల వేదిక జిల్లా ఇన్‌చార్జి డి.రాఘవేంద్ర ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినం సందర్భంగా వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు, రాఘవేంద్ర మాట్లాడారు. దేశంలో మానవ హక్కుల ఉల్లంఘన ప్రతి రంగంలోనూ కనిపిస్తోందన్నారు. అదే క్రమంలో అత్యాచారాలు పెరిగాయన్నారు. ప్రభుత్వాలు ప్రజల గొంతును నొక్కేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనలను అడ్డుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వాటర్ ప్లాంట్ తరలింపులో ఉద్రిక్తత

- గ్రామస్తులు అడ్డుకున్నా బలవంతంగా తరలించిన ఈఓఆర్డీ
- ప్లాంట్ తరలింపునకు తామెలాంటి ఆదేశాలివ్వలేదన్న ఎంపీడీఓ


వాటర్ ప్లాంట్‌ను తొలగిస్తున్న ఇన్‌చార్జి ఈఓఆర్డీ ప్రభుదాస్

చిలమత్తూరు: ఇరు గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను బలవంతంగా మరో ప్రాంతానికి తరలించడం వివాదాస్పదమైంది. వివరాలు.. చిలమత్తూరు మండలం సోమఘట్ట పంచాయతీలోని చెరువుకిందపల్లి వద్ద ప్రభుత్వ భూమిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఓ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. ఈ ప్లాంట్ ద్వారా చెరువుకిందపల్లి, ఎస్.కొత్తపల్లి గ్రామాల ప్రజలు ప్యూరిఫైడ్ వాటర్‌ను తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాటర్ ప్లాంట్‌ను అక్కడి నుంచి తరలించేందుకు కొందరు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకు సోమఘట్ట పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ ప్రభుదాస్ తోడయ్యారు.

పంచాయతీ తీర్మానం లేకుండానే..

ప్రజాప్రయోజనార్థం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను తరలించాలంటే పంచాయతీ ఆమోదం తప్పనిసరిగా ఉండాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ ప్రభుదాస్‌మంగళవారం వాటర్ ప్లాంట్‌ను అక్కడి నుంచి తొలగించారు. విషయం తెలుసుకున్న చెరువుకిందపల్లి, ఎస్.కొత్తపల్లి వాసులు అక్కడకు చేరుకుని ప్లాంట్ తరలింపును అడ్డుకున్నారు. ఆ సమయంలో స్థానికులపై ప్రభుదాస్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బెదిరింపులకు దిగాడు. అక్కడితో ఆగకుండా పోలీసులను పిలిపించి హంగామా చేశాడు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుని పరిస్థితి అదుపుతప్పింది. ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ జోక్యం చేసుకుని సర్దిచెప్పారు. గొడవ జరుగుతోందని ప్రభుదాస్ ఫోన్ చేయడంతో తాము వచ్చామని, అయితే ఇక్కడ అలాంటి పరిస్థితి ఏదీ లేకపోవడంతో వెనుదిరిగి వెళుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొనడం గమనార్హం.

సార్ చెప్పారు... నేను చేశా

ప్లాంట్‌ను అక్కడి నుంచి తరలించాలంటూ ఎంపీడీఓ రమణమూర్తి తనకు ఆదేశాలిచ్చారని, దీంతో తాను అక్కడి ఉంచి ప్లాంట్‌ను తొలగిస్తున్నట్లు ప్రభుదాస్ చెప్పుకొచ్చాడు. అయితే ఇదే విషయంపై ఎంపీడీఓ మాట్లాడుతూ.. తాను ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని విలేకరులు ప్రభుదాస్‌కు తెలపడంతో 'నాకు టీడీపీ నేతల అండ ఉంది, మీ ఇష్టమొచ్చింది రాసుకోండి, నన్నెవరూ ఏమీ చేయలేరు' అంటూ కవ్వింపు చర్యలకు దిగాడు.

అక్కడుంటే నష్టమేంటి?



రెండు గ్రామాలకు అనుకూలంగా ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను కేవలం రాజకీయ ప్రోద్బలంతోనే తరలిస్తున్నారు. ఏమని ప్రశ్నిస్తే ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ బెదిరిస్తున్నాడు. అసలు ప్లాంట్ అక్కడుంటే వారికొచ్చే నష్టమేంటో అర్థం కావడం లేదు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉందనే అప్పట్లో ప్లాంట్‌ను అక్కడ ఏర్పాటుకు అంగీకారం తెలిపాం. ఈఓఆర్డీ వ్యవహారం బాగోలేదు.
– వలసరెడ్డి, చెరువుకిందపల్లి

కలెక్టర్ చొరవ తీసుకోవాలి



ఊర్లో కొందరి మాటలు విని ప్లాంట్‌ను ఈఓఆర్డీ దౌర్జన్యంగా మరో ప్రాంతానికి మార్చేస్తున్నాడు. పోలీసులను పిలిపించి దౌర్జన్యానికి దిగడమేంటో అర్థం కావడం లేదు. మెజారిటీ ప్రజల అభిప్రాయం కన్నా వీళ్లకు రాజకీయాలే ముఖ్యమయ్యాయి. దీనిపై కలెక్టర్ చొరవ తీసుకోవాలి.
– పుష్పవతి, చెరువుకిందపల్లి